




భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

నేటి నుంచి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): హిందువులు అత్యంత పవిత్రంగా భావిస్తూ అమ్మవారిని పూజించే దసరా శరన్నరాత్రి మహోత్సవాలు సోమవారంనుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది దసరా ఉత్సవాలు 11రోజులపాటు రావడంతో అందుకు తగ్గట్లుగా ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులోభాగంగా కాకినాడ నగరంలోని సూర్యారావుపేటలోని బాలాత్రిపురసుందరి ఆలయంలో వచ్చేనెల 2వతేదీవరకూ వేడుకలను నిర్వహించనున్నారు. ప్రతిరోజూ అమ్మవారు రోజుకో అవతారంలో దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ ఆధ్వర్యంలో ఆలయంవద్ద భారీ ఏర్పాట్లు చేశారు. ఉచిత దర్శనంతోపాటు శీఘ్రదర్శనం ఏర్పాటుచేశామన్నారు. ఆలయంలో క్యూలైన్‌ను, మంచినీరు,దాతల సహకారంతో ఉచిత ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ప్రతిరోజూ రుద్రాభిషేకం, చండీహోమం, నవావరణార్చన, కుంకుమపూజలు జరుగుతాయన్నారు. 11 రోజులపాటు వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈఏడాది కొత్తగా 26న అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో అలంకరిస్తారన్నారు. ఆలయంవద్ద ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్ భక్తులను ఆకట్టుకుంటోంది. సంతచెరువు కనకదుర్గ ఆలయంవద్ద భారీవిద్యుత్‌దీపాలతో సెట్టింగ్స్ ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం ఆలయంలో అమ్మవారి ప్రతిష్టాపనతో వేడుకలు ప్రారంభం కానున్నాయి. జగన్నాథపురంలోని జమ్మిచెట్టు సెంటర్‌వద్ద కనకదుర్గ ఆలయం అమ్మవారి పూజలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగరంలో పురాతన ప్రసిద్ధి చెందిన దేవాలయం వీధిలోని

» జిల్లావ్యాప్తంగా ముస్తాబైన ఆలయాలు

పెద్ద శివాలయంవద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నగరంలోని రామారావుపేట, భానుగుడి సెంటర్, సూర్యానారాయణపురం, కొండయ్యపాలెం, శ్రీనగర్, సినిమారోడ్డు, సాంబమూర్తినగర్, డైరీఫారం సెంటర్ తదితర ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను దసరా ఉత్సవాలకు ముస్తాబు చేశారు. భానుగుడి అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ పర్సన్ ఇన్‌చార్జి గోపాలకృష్ణ తెలిపారు.



బాలాత్రిపుర సుందరి ఆలయం వద్ద సెట్టింగ్



దసరా.. ధమాకా

దసరా వచ్చిందంటే ఆ సరదాయే వేరు.. విజయ దశమి విజయాలనిస్తుందని అందరి నమ్మకం.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇదీ మరీ ఎక్కువగా ఉంటుంది.. దసరాలో కార్లు, బైక్‌లు, టీవీలు, ఫ్రిడ్జ్‌లు తదితర వస్తువులు కొనుగోలు చేయడం అలవాటు. ఏదో ఒక కొత్త వస్తువులను కొనుగోలు చేయడం సెంటిమెంట్‌గా భావిస్తారు.. దసరాలో కొంటే కలిసొస్తుందని నమ్మకం..సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి.. అంతే కాకుండా కేంద్రం ప్రకటించిన జీఎస్టీ తగ్గుదల సోమవారం నుంచి అందుబాటులోకి రానుంది. దీంతో కొనుగోలుదారులకు నిజంగానే దసరా పండుగ తేనుంది. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో చేపట్టిన జీఎస్టీ సంస్కరణలతో పేదలు, మధ్యతరగతి ప్రజలకు ధరాభారం తగ్గింది. ఈ నెల 22 నుంచి అధికారికంగా వివిధ వస్తువులు ధరలు తగ్గనున్నాయి. ఏసీలపై రూ. 3 వేల నుంచి రూ.5 వేలు, ఫ్రిడ్జ్‌లపై రూ.2 వేలు, టీవీలపై గరిష్ఠంగా రూ.5 వేలు, కార్లపై రూ.లక్ష నుంచి రూ.3లక్షలు, బైక్‌లపై రూ.10 వేల నుంచి రూ.30 వేల జీఎస్టీ తగ్గిన దరిమిలా మార్కెట్‌కు కళ రానుంది. నేటి నుంచి దశమి పర్వదినం మొదలు కావడం దశమి అనంతరం దీపావళి పండుగ ఉండడంతో వ్యాపార వర్గాలు తమ తమ వ్యాపార సముదాయల్లో స్టాక్ పూర్తి స్థాయిలో ఉంచారు.

రాజమహేంద్రవరానికి చెందిన గణేష్ గత నెలలో ఒక కారు కొనుగోలు చేశాడు.. ఖరీదు రూ.13.80 లక్షలు.. అప్పట్లో కార్లపై 28 శాతం జీఎస్టీ ఉండేది. దీంతో అతను జీఎస్టీ కింద అప్పట్లో రూ.2.50 లక్షలు చెల్లించాడు.. రేపటి నుంచి జీఎస్టీ 18 శాతానికి తగ్గనుంది..అంటే 10 శాతం పడిపోయింది. అతను ఇప్పుడు కారు కొంటే 1,03,800 తగ్గనుంది. ఒక కారుకు రూ.లక్ష తగ్గడం అంటే మామూలు విషయం కాదు కదా.. అందుకే కార్లు కొనుగోలుదారులు జీఎస్టీ తగ్గుదలకు ఎదురుచూస్తున్నారు..

రాజమహేంద్రవరానికి చెందిన కిరణ్ ప్రతి నెలా మందులకు రూ.10 వేలు ఖర్చుచేస్తాడు. గతంలో మందులపై జీఎస్టీ కింద 5 నుంచి 12 శాతం చెల్లించేవాడు. మందులపై జీఎస్టీ తొలగించడంతో ఇప్పుడు సుమారు రూ.వెయ్యి వరకూ కలిసి రానుంది.గోదావరి జిల్లాలో షుగర్, బీపీ, డయాలసిస్, కేన్సర్ రోగులు అధికం.మందులపై జీఎస్టీ ఎత్తివేయడంతో ప్రయోజనం కలగనుంది. మందులపై పూర్తిగా జీఎస్టీ ఎత్తేశారు. గతంలో 5 నుంచి 12 శాతం ఉండేది. దీంతో వీటి ధరలు బాగా తగ్గనున్నాయి.
- రాజమహేంద్రవరం/సిటీ

మార్కెట్ డల్‌గా మారింది..గత 20 రోజులుగా ఎక్కడా కొనుగోళ్లు సాగలేదు.. షాపింగ్ మాల్స్ వెలవెలబోయాయి.. కార్ల షోరూంలు కస్టమర్లు రాక కళతప్పాయి.. ఎందుకంటే నిన్నటి వరకూ మార్కెట్‌లో ఏవస్తువు కొన్నా ఎంఆర్‌పీకి అదనంగా వస్తు-సేవల పన్ను పేరిట (జీఎస్‌టీ) అద నంగా చెల్లించాల్సిందే. నిత్యావసరాలపై పన్ను బాదుడు ఉండేది.దీంతో జనం నిరాశ వ్యక్తం చేసేవారు.అయితే కేంద్రం 2.0 జీఎస్టీ విధానం పేరిట కొన్ని వస్తువులను మినహాయించి ప్రజలకు దసరా కానుక అందించింది.గతంలో జీఎస్టీ స్లాబ్‌లు 5, 12, 18, 28 శాతంగా ఉండేవి. ప్రస్తుతం కేవలం 5,18 స్లాబ్‌లు మాత్రమే మిగిలాయి..దీంతో గృహోపకరణాలు, కార్లు,నిత్యావసరాలపై జీఎస్టీ తగ్గించడంతో ధరలు తగ్గనున్నాయి.ఈ నేపథ్యంలో జీఎస్టీ తగ్గింపునకు జనం వెయిట్ చేస్తున్నారు. సోమవారం నుంచి కొనుగోలుదారులతో షోరూమ్‌లు, మార్కెట్ కళకళలాడనుంది.

బీమా.. రంగం..

మరోవైపు బీమా రంగం వ్యాపారం ఊపందుకుంటుం దని నిపుణులు అంచనా వేస్తున్నారు.ఎల్‌ఐసీతో పాటు ఆరోగ్య బీమా,ఇతర బీమా పాలసీలపై జీఎస్టీని పూర్తిగా తొలగించారు. ఆయా కంపెనీలు తమ ఏజెంట్లను అప్రమత్తం చేసి ప్రోత్సాహకాలు ప్రకటిస్తూ అధిక సంఖ్యలో పాలసీలు రాబట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి. సోమవారం ఎల్‌ఐసీ ఏజెంట్లకు పలు ప్రోత్సాహకాలు ప్రకటించింది. పలు బీమా కంపెనీలు సోమవారం పనిఒత్తిడిని తట్టుకోవడానికి శని, ఆదివారాలు సైతం కార్యకలాపాలు కొనసాగించారు. దీంతో బీమా పాలసీలు సైతం పెరగనున్నాయి. ఎందుకంటే నిన్నటి వరకూ 18 శాతం జీఎస్టీ ఉండేది.

జీఎస్టీ సంస్కరణలు అదరహో

» నేటి నుంచి జీఎస్టీ శ్లాబ్‌ల తగ్గుదల
» 5,18 శ్లాబ్‌లకే పరిమితం
» 20 రోజులుగా పడిపోయిన అమ్మకాలు
» ఖాళీగా షాపింగ్ మాల్స్..షోరూమ్‌లు
» పుంజుకోనున్న అమ్మకాలు,కొనుగోళ్లు
» భారీగా తగ్గనున్న కార్లు, బైక్‌ల ధరలు
» నిత్యావసరాలపైనా తగ్గింపు
» కొనుగోలుదారుల ఆనందం

విద్యార్థుల సామగ్రి..మందులపై ఉపసంహారణ

విద్యార్థులు ఉపయోగించే వస్తువులపై జీఎస్టీ మినహాయించారు. కొన్నింటిపై 12 శాతంగా ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించారు. మందులపై కూడా జీఎస్టీ ఉపసంహరణ రోగులకు వరం కానుంది. యునాని, సిద్ధ, హోమియోపతి సహా అన్ని మందులు, ఆక్సిజన్, డయా గ్నోస్టిక్ కిట్లు, సర్జికల్ కిట్లపై 12 శాతంగా ఉండే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో వ్యవసాయమే జీవనాధారం. రైతులు నీటిపారుదల శాఖలో ఉపయోగించే ట్రాక్టర్లు తదితర యంత్రాలపై గతంలో 12 శాతం జీఎస్టీ ఉండేది. దానికి 5 శాతానికి పరిమితం చేశారు. టెలివిజన్ సెట్లు (ఎల్‌సీడీ/ ఎల్ ఈడీ) మోనిటర్లు,ప్రొజెక్టర్లు, ఎయిర్ కండిషనర్లు, డిష్ వాషర్లపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉండేది.దానిని 18 శాతానికి పరిమితం చేశారు.సోలార్ వాటర్ హీటర్,సోలార్ కుక్కర్లపై 12 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు. గృహనిర్మాణ సామగ్రిపై జీఎస్టీని తగ్గించారు. గృహోపకరణాలపై 12 శాతంగా ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించారు. వ్యక్తిగత సంరక్షణకు రోజువారి వాడే వాటిపై 12 శాతం ఉండగా 5 శాతానికి పరిమితం చేశారు.

అతిథులకు ఆనందమే

గోదావరి పుష్కరాలకు రెండేళ్ల ముందే అతిథ్యసేవలపై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో హోటల్స్, లాడ్జిలు చిన్నపెద్దా కలిపి సుమారు రెండు వేలు పైబడి ఉన్నాయి.వాటిలో 5 స్టార్, త్రీస్టార్, హోటల్స్ కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం ,సామర్లకోట, తుని,అన్నవరంలో ఉన్నాయి. దిండి,రంపచోడవరం, మారేడుమిల్లి, యానాంలలో హోటల్స్, రిసార్ట్స్ ఉన్నాయి. వాటిలో సోమవారం నుంచి 5 శాతమే జీఎస్టీ వసూలు చేస్తారు.

అవగాహనకు చర్యలు

ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా వాణిజ్య పన్నులశాఖ అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఏసీటీవో, సీటీవోలు తమ స్థాయిలో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నారు. ప్రాధాన్యతల వారీగా 16 రంగాల్లో ఫ్లయర్స్ (పిక్టోరియల్)గ్రాఫ్‌లను ప్రధాన కూడళ్లలో ప్రదర్శించి వాటిని చూసిన వెంటనే ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో సిద్ధం చేస్తున్నారు. మరోవైపు పంచాయతీరాజ్, రెవెన్యూ, గ్రామసచివాలయాల ఉద్యోగులతో కలిసి ప్రజల్లోకి వెళ్లనున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ చేపట్టిన చొరవతోనే జీఎస్టీ ధరాభారం తగ్గిందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ నాయకులు కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి ప్రదర్శన నిర్వహించనున్నారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం సోమవారంఉదయం 10గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ షాన్ మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. కార్యక్రమానికి హాజరుకాలేని వారు మీ కోసం వెబ్‌సైట్‌లో అర్జీలను నమోదు చేసుకుని పరిష్కరించుకోవచ్చునన్నారు.

వీధి విక్రయదారుల కోసం లోక కల్యాణ మేళాలు

» మెప్మా పీడీ బి.ప్రియంవద

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి స్వనిధి 2.0 పథకానికి అనుగుణంగా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో సెప్టెంబరు 17నుంచి అక్టోబరు 2 వరకు జిల్లాలో లోక కల్యాణమేళాలు నిర్వహిస్తున్నట్లు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ప్రియంవద తెలిపారు. ఈ మేళాలను కాకినాడ నగరపాలక సంస్థ, సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం, తుని మున్సిపాలిటీలు, గొల్లప్రోలు, ఏలేశ్వరం నగర పంచాయతీల పరిధిలో మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. వీధి విక్రయదారుల గుర్తింపు, ప్రొఫైలింగ్ గుర్తింపుకార్డుల పంపిణీ అర్హులైన వారికి బ్యాంకు రుణసౌకర్యం కల్పిస్తామన్నారు. 1వ విడత రూ.15వేలు, 2వ విడతలో రూ.25వేలు, 3వవిడత రూ.50వేలు అందింస్తారన్నారు. డిజిటల్ పేమెంట్స్‌పై అవగాహన, ఫుడ్ లైసెన్సు మంజూరు, హెల్త్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మేళాలో బ్యాంక్ మేనేజర్లు, ఆరోగ్య శాఖ, ఫుడ్ లైసెన్సింగ్ అధికారులు, డిజిటల్ అగ్రిగేటర్లు, ఎన్‌జీవోలు, స్ట్రీట్ వెండింగ్ సభ్యులు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. ఈ మేళాలను ఉపయోగించుకుని అందుబాటులో ఉన్న సదుపాయాలను పొందాలన్నారు.



నాలా పన్ను వసూళ్ల బాధ్యత స్థానిక సంస్థలదే

» రెవెన్యూ శాఖకు విముక్తి
» గెజిట్ నోటిఫికేషన్ జారీ
» స్థానిక సంస్థలకు ఆదాయం
» త్వరలో మార్గదర్శకాలు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ పరిశీలనల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఏపీ అగ్రికల్చర్ ల్యాండ్ కన్వర్షన్ ఫర్ నాన్ అగ్రికల్చర్ పర్పసెస్ (నాలా చట్టం) 2006ను అధికారికంగా రద్దు చేస్తూ ఆర్డినెన్స్ విడుదల చేసింది. దీంతో నాలా పన్ను వసూళ్ల బాధ్యతలను ఇక స్థానికసంస్థలకు అప్పగిస్తూ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఏపీ అగ్రికల్చర్ ల్యాండ్ కన్వర్షన్ ఫర్ నాన్ అగ్రికల్చర్ పర్పసెస్ నాలా చట్టం-2006 రద్దుతో ఇక స్థానిక సంస్థలకు డెవలప్‌మెంట్ కింద నాలుగు శాతం వరకు వసూలు చేసే అవకాశం ఇవ్వనున్నారు. దీనికి త్వరలో మార్గదర్శకాలు రానున్నాయి.

బేసిక్‌పై గతంలో ఐదు శాతం పన్ను

గ్రామాలు, పట్టణాల్లో వ్యవసాయ భూమిని ఇతర వ్యవహారాలకు అనువుగా మార్పిడి చేసుకునే సమయంలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌గా భూమి బేసిక్ విలువపై ఒకేసారి ఐదు శాతం భూ యజమానులు నాలా కింద రెవెన్యూ శాఖకు చెల్లించేసేవారు. లేఅవుట్లు, ఇతర ప్లాట్ల విషయంలోను ఈ మొత్తాలు రెవెన్యూ శాఖకు జమకావడంలేదు. ఆర్డీవోలు, తహశీల్దార్ల పర్యవేక్షణ లేక నాలా పన్ను వసూళ్లు మందగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థలకే ఈ బాధ్యత అప్పగిస్తే వారే సకాలంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి నాలా వసూళ్లకు శ్రీకారం చుడతారని ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉపసంఘం తీర్మానిచింది.ఈ కొత్త విధానం ద్వారా స్థానిక సంస్థలుగా డెవలప్‌మెంట్ ఫీజు రూపంలో పెరిగిన ఆదాయంతో మరింత పరిపుష్టి చెందుతాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

2006 నుంచి ఇలా..

నాలా చట్టం 2006, జనవరి 1 నుంచి అమల్లోకి రాగా అప్పట్లో భూమి విలువపై 9 శాతం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద కట్టి ఆర్డీవోల ద్వారా భూయజమానులు ఉత్తర్వులు పొందేవారు. కాలక్రమేణా ఈ పన్ను 9 నుంచి 7, 5 శాతాలకు తగ్గింది. వైసీపీ ప్రభుత్వంలో 3 శాతానికి తగ్గించగా కూటమి ప్రభుత్వం ఐదు శాతం చేసింది. తీరా ఆచరణలో ఈ పన్ను వసూళ్లు సక్రమంగా లేకపోవడంతో చట్టం రద్దుకు నిర్ణయించారు.నాలా కింద కాకినాడ జిల్లాలో రెండు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మూడు, తూర్పుగోదావరి జిల్లాలో రెండు, ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో మొత్తం 7 ఆర్డీవో కార్యాలయాల ద్వారా పన్ను వసూళ్లను చేయాల్సి ఉంది. ఏటా ఇది సక్రమంగా సాగడంలేదని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. నూతన విధానంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు నగర పాలక సంస్థలు, ఏడు మున్సిపాల్టీలు, మూడు నగర పంచాయతీలు. వీటితో పాటు నాలుగు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు నాలా వసూళ్లను చేపట్టనున్నాయి. తద్వారా స్థానిక సంస్థలకు ఆర్థికంగా చేయూత ఇవ్వనుంది. తాజాగా రెవెన్యూ శాఖ నుంచి తప్పించగా వీటిని వసూళ్లకు స్థానిక సంస్థలు ఇక ముందుకు సాగనున్నాయి.

ఇక ఎక్కడి నుంచైనా..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

» అంగన్‌వాడీ సరుకులు తీసుకునే వెసులుబాటు
» పోషణ్ ట్రాకర్ యాప్‌లో గర్భిణులకు మైగ్రేషన్ ఆప్షన్



అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవల్లోనూ పలు మార్పులు వస్తున్నాయి. లబ్ధిదారులకు అనుకూలంగా ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంటోంది. ఈ కేంద్రాల నుంచి బాలలింతలు, గర్భిణులకు అందజేసే పౌష్టికాహారం పంపిణీలో నూతన విధానాన్ని తీసుకొచ్చింది. ఇప్పటి వరకు ఏ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని వారు ఆ అంగన్‌వాడీ కేంద్రంలో సరకులు తీసుకునేవారు. ప్రస్తుతం ఏ కేంద్రం నుంచైనా పోషకాహారం తీసుకునే వెసులుబాటు కల్పించింది.

జిల్లాలో ఎన్ని కేంద్రాలంటే..

అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు పోషకాహారం అందజేస్తారనే విషయం అందరికీ తెలిసిందే. కాకినాడ జిల్లాలోని 1986 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో ప్రత్తిపాడు నియోజకవర్గంలో 3645మంది చిన్నారులు, కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 4945మంది చిన్నారులు, జగ్గంపేట నియోజకవర్గంలో 5281మంది చిన్నారులు, పెద్దాపురం నియోజకవర్గంలో 6201మంది, పిఠాపురం నియోజకవర్గంలో 6495మంది, కాకినాడ అర్బన్ నియోజకవర్గంలో 7540మంది, తుని నియోజకవర్గంలో 8438మంది చిన్నారులు ఉన్నారు. వీరితోపాటు బాలింతలు, గర్భిణులకు ఇక్కడినుంచే పౌష్టికాహారాన్ని అందజేస్తారు. ఇప్పటివరకు ఎక్కడి లబ్ధిదారులు అక్కడే వాటిని తీసుకోవాల్సి వచ్చేది. గతంలో కేంద్రాల్లో నమోదైన లబ్ధిదారులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినా.. సరకులు ఇచ్చే సమయంలో స్థానికంగా లేకపోయినా ఆ నెల అందేవి కావు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం నెరవేరేది కాదు. ప్రస్తుతం ఏ కేంద్రం నుంచైనా పౌష్టికాహార సరకులు తీసుకునే అవకాశం కల్పిస్తోంది.

ఇలా చేయాలి..


అంగన్‌వాడీ కేంద్రాల్లో పలుచోట్ల అవకతవకలు జరుగుతుంటాయి. కొంతమంది సరకులను పక్కదారి పట్టిస్తుంటారు. అలాంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. 'పోషణ్ ట్రాకర్' పేరుతో ప్రవేశపెట్టిన ఈ యాప్‌లో 'మైగ్రేషన్' అనే ఆప్షన్‌ను ఏర్పాటుచేశారు. వలస వెళ్లే లబ్ధిదారులు ఎక్కడ తాత్కాలిక నివాసం ఉంటే అక్కడ సమీప అంగన్‌వాడీ కేంద్రాల్లో తీసుకోవచ్చు. ఆయా ప్రాంతాల్లో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు సమాచారం ఇస్తే వారు నమోదు చేసుకుని సేవలందిస్తారు. కేంద్రాలకు రాలేని గర్భిణులు ఎక్కడ ఉంటే అక్కడ తమ ఫోన్‌లో యాప్ ఓపెన్ చేసి ముఖ ఆధారిత రికగ్నిజేషన్, వేలిముద్రలు నమోదు చేసుకుంటే వారి ఇంటికే ఆహారం అందజేస్తారు. ఈ మైగ్రేషన్ పద్ధతి హైరిస్క్ గర్భిణులకు ఎంతో మేలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి చెబుతున్నారు. ఎక్కడ.. ఏ ప్రాంతంలో ఉన్నా.. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని సరుకులు తీసుకోవచ్చని అంటున్నారు.

ఎన్టీఆర్ బీచ్‌లో ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):కాకినాడ ఎన్టీఆర్ బీచ్ ఆదివారం సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. యువకులు సముద్రంలో ఈతకొడుతూ, ఇసుకలో బైక్ రైడింగ్ చేస్తూ ఎంజాయ్ చేశారు. చిన్నారులు ఇసుకలో ఆటలాడు కుంటూ ఉల్లాసంగా గడిపారు. కెరటాల ఉధృతితో వాకలపూడి మెరైన్ సీఐ రామోహ్మన్‌రెడ్డి ఆదేశాలతో సిబ్బంది సందర్శకులు సముద్రం లోపలికి వెళ్లి స్నానాలు చేయకుండా పర్యవేక్షించారు. ఎన్టీఆర్‌బీచ్‌లో కౌడా నిధులు రూ.7.09కోట్లతో ఏర్పాటుచేసిన టీయూ-142 యుద్ధవిమాన మ్యూజియాన్ని తిలకించేందుకు సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. యుద్ధ విమానం లోపల, బయట, చిల్డ్రన్స్ పార్కు వద్ద సెల్ఫీలు తీసుకుని సందడి చేశారు.



కాకినాడ బీచ్‌లో సముద్ర స్నానాలు చేస్తున్న సందర్శకులు



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్న అవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు‘గండం’

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాధరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తుతం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. ‘మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం’ అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్నానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌తమునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోవకు పోటెత్తిన భక్తులు

ఆలయానికి రూ.2.21 లక్షల ఆదాయం



తలుపులమ్మ అమ్మవారు

తునిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు లోవ క్షేత్రానికి తరలివచ్చారు. వేకువజామునే ఆలయ పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు బారులుతీరిన అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం వివిధ విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.2.21 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

శరన్నవరాత్రి వేడుకలు

సోమవారం నుంచి జరగనున్న శరన్నవరాత్రి వేడుకలకు లోవ దేవస్థానం సిద్ధమైంది. 11రోజులపాటు తలుపులమ్మ అమ్మవారు 11 అవతారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సోమవారం నుంచి వివిధ అలంకరణలో దర్శనమివ్వనున్నారు. 22న శ్రీబాలాత్రిపుర సుందరిగా, 23న శ్రీగాయిత్రిదేవిగా, 24న శ్రీఅన్నపూర్ణాదేవిగా, 25న శ్రీకాత్యాయని దేవిగా, 26న మహాలక్ష్మీదేవిగా, 27న శ్రీలలితాదేవి, 28న శ్రీమహాచండీదేవిగా, 29న శ్రీసరస్వతిదేవిగా (మూలా నక్షత్రం), 30న శ్రీదుర్గాదేవిగా, అక్టోబరు1న శ్రీమహిసాసురమర్దిని దేవిగా, 2న శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో తలుపులమ్మ అమ్మవారు దర్శనం ఇస్తారు.

నేటి నుంచి విజయదుర్గా పీఠంలో దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం



రాయవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం వెదురుపాక విజయదుర్గా పీఠంలో సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో గాడ్ కుమార్తె సత్యవెంకట కామేశ్వరి చేతుల మీదుగా ఉదయం 8.16గంటలకు కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్టు అడ్మినిస్ట్రేటర్ తెలిపారు. తొలుత అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు ప్రత్యేక అలంకరణ జరిపి అర్చనలు, హారతులు ఇవ్వనున్నారు. భక్తులతో అమ్మవారికి సామూహిక శ్రీచక్ర కుంకుమార్చన జరిపిన అనంతరం మహా నివేదన జరిపి భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నారు. సాయంత్రం భాగవత పారాయణం, విష్ణుసహస్రనామ పారాయణం, సువాసినీల పూజ, అమ్మవారికి కుంకుమార్చనలు, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన చతుర్వేద స్వస్తి, దర్బార్‌సేవ జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేయనున్నారు. భక్తులు ఈవేడుకల్లో పాల్గొనాలని అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు కోరారు.

వెంకన్న ఆలయంలో భక్తజన సందడి



వాడపల్లి ఆలయంలో భక్తుల పూజలు

ఆత్రేయపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తజన సందడి నెలకొంది. వేకువజామునే స్వామివారికి ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం, నివేదన, గోపూజ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. ఆలయంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పరిశీలించారు.

మైనార్టీ పాఠశాలలకు 27 నుంచి దసరా సెలవులు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని మైనార్టీ పాఠశాలలకు ప్రభుత్వ అకడమిక్ కేలండర్ ప్రకారం ఈనెల 27 నుంచి అక్టోబరు 2 వరకూ దసరా సెలవులు పాటించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి అక్టోబరు 3న అన్ని పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని విద్యాసంస్థల యాజమాన్యాలకు ఈనెల 22 నుంచి దసరా సెలవులు ప్రకటించామని, మైనార్టీ పాఠశాలలకు మాత్రం అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సెలవులు ఇస్తున్నట్టు డీఈవో పేర్కొన్నారు.

అటవీ ప్రాంతాల్లో దసరా పుట్టగొడుగులు



మోతుగూడెం అటవీ ప్రాంతంలో దసరా పుట్టగొడుగులు

మోతుగూడెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వర్షాలతో మొలకెత్తుతున్న పుట్టగొడుగులు సేకరణ ద్వారా గిరిజనులకు మంచి ఆదాయం లభించనుంది. చింతూరు మండలం మోతుగూడెం అటవీ ప్రాంతాలలో కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ ప్రాంతం లో సహజ సిద్ధంగా దసరా పుట్ట గొడుగులు మొలకెత్తుతున్నాయి. ఈ ప్రాంత ప్రజలు వాటిని సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఏడాదికి ఒకసారి మాత్రమే సహజ సిద్ధమైన దసరా పుట్టగొడుగులు వస్తుంటా యి. ఎన్నో రకాల మాంసకృతులుం డే ఈ పుట్టగొడుగులకు మంచి డి మాండ్ ఉంది. ప్రతి ఏటా అరకొర గా దొరికే దసరా పుట్టగొడుగులు ఈసారి మా త్రం భారీగా ఉండడంతో మోతుగూడెం ప్రాంత ప్రజలు వీటి సేకరణపై దృష్టి సారించారు. వాటి వల్ల గిరిజనులకు మంచి ఆదాయం కూడా వస్తుంది.

గోకవరంలో వ్యక్తి అనుమానాస్పద మృతి

గోకవరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై ఆదివారం గోకవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దేవీపట్నం మండలం ఎం.రావిలంక గ్రామానికి చెందిన ఈక నరసింహులుదొర(39) కుటుంబ సభ్యులతో కలిసి ఏడాది నుంచి గోకవరం గ్రామ శివారున సాయిప్రియాంక లేఅవుట్‌లో నివాసం ఉంటున్నాడు. అతడికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య గంగవరం మండలంలో సచివాలయం ఉద్యోగిగా పని చేస్తున్నట్టు సమాచారం. నరసింహులు ఆదివారం ఇంట్లో ఎవ్వరులేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందాడు. భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని స్థానికులు అంటున్నారు. ఈ ఘటనపై మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాపునాడు కార్యవర్గ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక దేవిచౌక్‌లోని కాపునాడు కార్యాలయంలో ఆదివారం కాపునాడు ఉభయ గోదావరి జిల్లాల కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు విజయవాడలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.సమావేశంలో కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం,ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ నాయకుడు మజ్జి రాంబాబు, పంతం కొండలరావు, బొమ్ముల దత్తు,అడబాల రామకృష్ణ, కేవీ రామారావు, దేశినీడి రాంబాబు, రుద్రప్రసాద్, కె.చక్కారావు పాల్గొన్నారు.

ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలి: ఎస్‌ఐ

బిక్కవోలు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దసరా సెలవులకు ఊళ్లకు వెళ్లే వారు అప్రమత్తంగా వుండాలని ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ సూచించారు.ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఊళ్లకు వెళ్లేవారు సమాచారం అందిస్తే రాత్రుళ్లు గస్తీ సమయాల్లో ఆ ఇళ్లపై నిఘా ఉంచుతామన్నారు.డబ్బులు, బంగారు వస్తువులను బ్యాంకు లాకర్‌లో ఉంచుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పెద్దపెద్ద కంపెనీలు పండుగ ఆఫర్‌లు ఇచ్చినందున ఇదే అదునుగా భావించి సైబర్ నేరగాళ్లు డూప్లికేట్ ఐడీ క్రియేట్ చేసి ప్రజలను మోసం చేసే ప్రమాదముందని, తెలియని ఆన్‌లైన్ లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని ఎస్‌ఐ సూచించారు.



కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో మోడ్రన్ పెంటాథ్లాన్ చాంపియన్‌షిప్‌ను ప్రారంభిస్తున్న రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు

ఘనంగా ప్రారంభమైన ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ మోడ్రన్ పెంటాథ్లాన్ చాంపియన్‌షిప్

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ మోడ్రన్ పెంటాథ్లాన్ బయాథలాన్ చాంపియన్‌షిప్ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్య అతిథి, మోడ్రన్ పెంటాథ్లాన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథి, డీఎస్డీవో శ్రీనివాసకుమార్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి 13 జిల్లాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ మోడ్రన్ పెంటాథ్లాన్ అనేది ఒలింపిక్ గేమ్ అని, ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న దీనిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ‘శాప్’లో భాగస్వామి చేసిందన్నారు. ఇందులో పాల్గొనే క్రీడాకారులు చాలా దృఢంగా తయారవుతారన్నారు. ఇక్కడి ఈవెంట్లో మెడల్స్ సాధించిన వారు త్వరలో ఇండోర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని, అక్కడ విజేతలుగా నిలిచిన వారు దక్షిణాఫ్రికాలో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటారన్నారు. డీఎస్డీవో శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ గ్రౌండ్‌లో ఈ గేమ్ నిర్వహిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షుడు ఆర్.హరిబాబు, జిల్లా కార్యదర్శి బీఎస్ఎస్ కుమారి, జిల్లా కోచ్ కట్టా జగన్‌మోహన్ కిషోర్, అలయన్స్ సౌత్ మల్టిపుల్ ట్రెజరర్ వనుం శ్రీనివాస్, ఏవీవీ సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ జి.శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వి.మాచరరావు, పీఈటీల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, డిస్ట్రిక్ట్ స్కూల్ గేమ్స్ సెక్రటరీ బీఎస్‌వీఎస్ఎస్ ప్రసాద్, వనుం ఉపేంద్రనాథ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జిమ్నాస్టిక్స్‌లో విన్యాసాలు చేస్తున్న క్రీడాకారిణి

దసరా ఉత్సవాలకు ముస్తాబైన పాదగయ



పాదగయ క్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

దక్షిణ కాశీగా, శక్తి పీఠంగా విరాజిల్లుతూ స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి కొలువైఉన్న కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రం దేవీ శరన్నవరాత్రులకు ముస్తాబైంది. ఈ సమయంలో అమ్మవార్లను దర్శించుకుని కుంకుమ పూజలు చేసేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా వస్తారు. ఇందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక పూజలు..

పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి చెంతన ఆదిశంకరాచార్యులతో ప్రతిష్ఠితమైన రాజరాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవత పురుహూతికా అమ్మవార్ల శరన్నవరాత్ర, శత చండీ యాగ మహోత్సవాలు సోమవారం ప్రారంభంకానున్నాయి. అక్టోబరు 2 వరకు జరిగే నవరాత్రుల్లో రాజరాజేశ్వరి అమ్మవారు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. ప్రతిరోజూ మహా గణపతిస్వామికి విఘ్నేశ్వర పూజ, దత్తాత్రేయస్వామి, కుక్కుటేశ్వర స్వామికి అభిషేకాలు, రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రాతఃకాల విశేష సహస్రనామార్చన, నీరాజన

- నేటి నుంచి శరన్నవరాత్రి, శత చండీ యాగ మహోత్సవాలు
- 11 రోజులపాటు ప్రత్యేక పూజలు
- భారీగా తరలిరానున్న భక్తులు

మంత్రపుష్పాలు, సాయంత్రం సామూహిక విశేష కుంకుమార్చనలు, ప్రత్యేకార్చనలు, మహానివేదన, చతుర్వేద స్వస్తి, దర్బారు సేవ జరుగుతాయి. పురుహూతికా అమ్మవారి శరన్నవరాత్ర శత చండీ యాగంలో భాగంగా ప్రతిరోజూ విఘ్నేశ్వర పూజ, శత చండీ యాగ సంకల్పం, చండీపారాయణలు, రాజరాజేశ్వరి దేవికి కుంకుమా

ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

పాదగయలో సోమవారం నుంచి జరిగే శరన్నవరాత్ర, శతచండీయాగ మహోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేశాం. స్వామి, అమ్మవార్ల దర్శనాలు, కుంకుమ పూజలు నిమిత్తం వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. సులభతరంగా దర్శనాలు అయ్యేలా చర్యలు తీసుకున్నాం. ఉత్సవాల్లో భాగంగా 11 రోజులు అమ్మవార్లకు ప్రత్యేక అలంకారాలు చేస్తాం. పుష్కరిణిలో నీటిని తొలగిస్తున్న భక్తులకు జల్లు స్నానాలు ఏర్పాట్లు చేశాం. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తరించాలని కోరుతున్నాం.



- కాట్నం జగన్మోహనశ్రీనివాస్, ఈవో, పాదగయ

ర్చన, స్వాములకు అభిషేకాలు, పురుహూతికా అమ్మవారికి శ్రీచక్ర నవావరణార్చనసహిత ప్రత్యేక సహస్ర పుష్పార్చనలు, శ్రీచక్ర లక్ష కుంకుమార్చన, చండీయాగం, సాయంత్రం సహస్ర పుష్పార్చనలు జరుగుతాయి. అక్టోబరు 2న మధ్యాహ్నం మహా పూర్ణాహుతి జరుగుతుంది.

అమ్మవార్లకు పట్టు చీరలు పంపిన పవన్

రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు దసరా శరన్నవరాత్రుల సమయంలో అలంకారాలు చేసేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పట్టు చీరలు పంపారు. ఏటా జరిగే ఉత్సవాల సమయంలో స్థానిక ఎమ్మెల్యే పట్టుచీరలు సమర్పించడం సంప్రదాయంగా వస్తోంది. దీనికి అనుగుణంగా పవన్‌కల్యాణ్ తన సొంత ఖర్చుతో 22 చీరలు కొనుగోలు చేసి పాదగయ క్షేత్రానికి పంపి ఈవోకు అందజేశారు.

అలంకారాలు...

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రతిరోజూ ఒక అలంకారం చేస్తారు. 22న రాజరాజేశ్వరి, 23న బాలాత్రిపురసుందరి, 24న అన్నపూర్ణాదేవి, 25న గాయత్రిదేవి, 26న లక్ష్మీదేవి, 27న కాళికాదేవి, 28న సరస్వతీదేవి, 29న దుర్గాదేవి, 30న మహిషాసురమర్దిని, అక్టోబరు 1న విజయదుర్గాదేవి, 2న విజయదశమి రోజున రాజరాజేశ్వరీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. విజయదశమి పర్వదినాన సాయంత్రం ఆరు గంటల నుంచి శమీ పూజ, పాదగయ పుష్కరిణిలో హంసవాహనంపై అమ్మవార్ల తెప్పోత్సవం జరుగుతాయి.

నేటి నుంచి మహాశక్తి యాగం

శ్రీపీఠంలో అక్టోబరు 3 వరకు నిర్వహణ



మహా శక్తి యాగానికి సిద్ధమైన ప్రాంగణం

సర్పవరం జంక్షన్ (కాకినాడ), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ రమణయ్యపేట శ్రీపీఠం లో 11 రోజుల పాటు జరిగే 3వ మహాశక్తి యాగం-2025 నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేశారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శ్రీపీఠం వ్యవస్థాపకుడు స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో ఆలయం వెనుక గల మహాశక్తి యాగం ప్రాంగణంలో సోమవారం నుంచి అక్టోబరు 3 వరకు వంద కోట్ల లలితా సహస్ర నామ కుంకుమార్చన మహా క్రతువు నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. నిత్యం సుమారు 30వేల మందికి పైగా భక్తులు కూర్చునేలా భారీ షెడ్లు ఏర్పాటు చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 120 మంది ఋత్వికులు, సుమారు 3వేల మంది సేవకులు ఇప్పటికే శ్రీపీఠానికి చేరుకున్నారు. కుంకుమార్చన జరిగే 11 రోజుల్లో ఉదయం సిబ్బందికి అల్పాహారం, మధ్యాహ్నం వేలాది మందికి అన్న ప్రసాదం తయారీకి ప్రత్యేక వంటల మాస్టర్లు, సిబ్బంది వచ్చారు. మధ్యాహ్న భోజనానికి సుమారు 70 కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు ఐశ్వర్యాంబిక అమ్మవారికి పూజతో సహస్ర చండీ, వారాహి, ప్రత్యంగిరా, బగళాముఖీ, రాజశ్యామల, వటుక భైరవ, సహస్ర రుద్ర, మహా రుద్ర హోమాలు ప్రారంభమవుతాయి. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు లలితా సహస్రనామ కుంకుమార్చన జరుగుతుంది. యాగంలో పాల్గొనే భక్తులకు ఇప్పటికే ప్రత్యేక ఐడీ కార్డులు జారీ చేశారు. 11 రోజులు కుంకుమార్చనలో పాల్గొనే భక్తులకు అమెరికాకు చెందిన దాత సహకారంతో నవ్యమైన రాగితో తయారు చేయించిన ఐశ్వర్య కంకణాన్ని చివర రోజున అందజేస్తారు. యాగం బందోబస్తు ఏర్పాట్లను కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు ఎస్‌డీపీవో పర్యవేక్షణలో సర్పవరం ఎస్‌ఐ శ్రీనివాస్‌కుమార్ సిబ్బందితో కలిసి ఆదివారం పర్యవేక్షించారు. సుమారు 50 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తామన్నారు.

జమిలి ఎన్నికలు దేశ ప్రగతికి దోహదం

ఒకే దేశం-ఒకే ఎన్నికపై సమావేశంలో న్యూఢిల్లీ ఎంపీ బాన్సూరి స్వరాజ్

పాల్గొన్న రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ



సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న బాన్సూరి స్వరాజ్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జమిలి (ఒకే దేశం-ఒకే ఎన్నిక) ఎన్నికల నిర్వహణ సంక్లిష్టమైన విజయవంతంగా నిర్వహిస్తే ప్రజాస్వామ్యానికి బలోపేతం దుగలంటిదని, దేశ ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తుందని న్యూఢిల్లీ పార్లమెంట్ సభ్యురాలు బాన్సూరి స్వరాజ్ అన్నారు. గోదావరి బంటిల్ క్రువల్ పోరం ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో ఒన్ నేషన్-ఒన్ ఎలక్షన్‌పై సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా బాన్సూరి స్వరాజ్ మాట్లాడుతూ వివిధదశల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎన్నికల వ్యయం పెరుగుతుందని, దేశ ఆర్థిక ప్రగతి కుంటుపడుతుందన్నారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం పెడరల్ స్ఫూర్తికి విఘాతమని ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టడం అర్థరహితమన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ జమిలి ఎన్నికలకు జనసేన పరంగా ఇప్పటికే పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ మద్దతు తెలిపారు. అయితే ప్రాంతీయ పార్టీలు, ప్రాంతీయ సమస్యల ప్రస్తావనకు ఇబ్బందిలేకుండా చూడాల్సి ఉంటుందన్నారు. ముఖ్యంగా రాజకీయ, పరిపాలనావరమైన సంస్కరణలు తెచ్చాక జమిలి ఎన్నికలకు వెళితే మంచిదని, లేకుంటే దుష్పలితాలు వచ్చే ప్రమాదం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ ఒకే దేశం-ఒకే ఎన్నిక అనేది కొత్త విషయం కాదని, 1967 వరకూ దేశంలో ఇదే విధానం ఉండేదన్నారు. అమెరికా, బ్రెజిల్, బెల్జియం, స్వీడన్ వంటి దేశాల్లోనూ జమిలి ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. జమిలి ఎన్నికల వల్ల ప్రాంతీయ పార్టీల ఉనికికే ప్రమాదం వస్తుందని, జాతీయ సమస్యలు తప్ప ప్రాంతీయ సమస్యలు పట్టించుకోరా అనే అనుమానాలు ఉన్నాయని, వీటిని నివృత్తి చేస్తూ ఏకాభిప్రాయం సాధించడానికే ఇలాంటి సమావేశాలు దోహదపడతాయన్నారు. ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకటరాజు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ జమిలి ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరగాలని, ఎన్నికల వ్యయం, సమయం ఆదా అవుతాయన్నారు. ఒకే దేశం-ఒకే ఎన్నిక కార్యక్రమం రాష్ట్ర కన్వీనర్ వేటుకూరి సూర్యనారాయణరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర మాట్లాడారు. జమిలి ఎన్నికల నిర్వహణపై వివిధ రంగాల ప్రముఖులు, విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఎంపీ బాన్సూరి స్వరాజ్ సమాధానాలిచ్చారు. పోరమ్ తరపున శివనాగరాజు, స్వర్ణ రజని, శివరామకృష్ణంరాజు, రవిశంకర్ పర్యవేక్షించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

● నలుగురు నిందితుల అరెస్ట్ ● 3.174 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులను అదుపులోకి తీసుకున్న కరప పోలీసులు

కరప, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం జడ్.భావారం గ్రామంలో గంజాయి ముఠాను అదుపులోకి తీసుకుని వారి నుంచి 3.174 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తేజ సునీత తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 20న గ్రామానికి చెందిన గుణ్ణం రాజశేఖర్ ఇంటి వద్ద కొంతమంది వ్యక్తులు గంజాయి కలిగి ఉన్నారనే సమాచారం మేరకు ఎస్ఐ సునీత, తహశీల్దార్ టి.దుర్గాప్రసాద్, వీఆర్వో, ఇతర పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. నిందితుడు రాజశేఖర్ పెదపూడి మండలానికి చెందిన వెన్నప లక్ష్మీగణపతి అలియాస్ గణేష్‌కు డబ్బులు ఇచ్చి కిలో గంజాయి తీసుకురావాలని పురమాయించాడు. అయితే తన వద్ద లేదని, తన స్నేహితుడు వాసంశెట్టి బన్ని ద్వారా తెప్పిస్తానని మాట ఇచ్చాడు. రామచంద్రపురంలో ఉంటున్న చెల్లూరి మణికంఠ అలియాస్ లడ్డు అనే వ్యక్తి వద్ద బన్ని 3 కిలోల గంజాయి తీసుకుని రాజశేఖర్ ఇంటికి వచ్చాడు. రాజశేఖర్, గణేష్, బన్నిలతో పాటుగా సత్య అనే వ్యక్తి తెచ్చిన గంజాయిని పంచుకుంటుండగా పోలీసులు మెరుపు దాడి చేసి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సప్లై చేసిన చెల్లూరి మణికంఠ పరారీలో ఉన్నాడు. కాగా ఈ కేసులో ప్రధాన నిందితుడు రాజశేఖర్ ఒక దినపత్రికలో రిపోర్టర్ అని చెప్పి ప్రజలను మోసం చేస్తూ గణేష్ అనే నిందితుడి నుంచి గంజాయి కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లలో విక్రయిస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఏ3 వాసంశెట్టి బన్నీపై రామచంద్రపురంలో ఒక గంజాయి కేసు ఉన్నట్టు చెప్పారు. కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో నిందితులను కాకినాడ కోర్టుకు తరలించగా మెజిస్ట్రేట్ అక్టోబరు 3 వరకు వారికి రిమాండ్ విధించినట్టు కరప పోలీసులు తెలిపారు. గంజాయి ముఠా గుట్టు రట్టు చేసిన కరప పోలీసులను పలు గ్రామాల ప్రజలు అభినందించారు.

కూళ్లలో బంగారు ఆభరణాల చోరీ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలన చేస్తున్న ఎస్‌ఐ జానీబాషా

కె.గంగవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం కూళ్ల గ్రామంలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. పామర్రు ఎస్ఐ ఎస్‌కె జానీబాషా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు చిట్టూరి అనంతలక్ష్మి సత్యవతి నూతనంగా గృహం నిర్మించుకుంటుంది. ప్రస్తుతానికి గ్రామంలో మండువా లోగిలిలో అద్దెకు ఉంటుంది. అక్కడ నుంచి నూతన గృహం నిర్మాణ పనులు చూసుకుంటుంది. శనివారం మధ్యాహ్నం అద్దెకు ఉంటున్న ఇంటి నుంచి గృహ నిర్మాణం పనులు చూసుకోవడానికి వచ్చింది. తిరిగి రాత్రి ఇంటికి వెళ్లేసరికి సుమారు 145 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు గుర్తించింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

భార్యను హింసించిన భర్త అరెస్ట్

కె.గంగవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం ఊడిమూడికి చెందిన పంచంగి జేబీకి ఏ.పిమవరానికి చెందిన రామకృష్ణతో 15ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. జీవిత రామకృష్ణ మద్యానికి బానిసై కుటుంబ పోషణ కూడా మానేశాడు. దీనిపై భార్య జేబీ ప్రశ్నించిందని హింసించాడు. జేబీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు నమోదు చేసి రామకృష్ణను అదుపులోకి తీసుకున్నామని పామర్రు ఎస్ఐ ఎస్‌కె జానీబాషా తెలిపారు.

ఆర్థిక లావాదేవీలే ప్రధాన కారణం...

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లావ్యాప్తంగా సంచలనం కలిగించిన గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో జరిగిన జంట హత్యలు, మరొకరిపై హత్యాయత్నం కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఆర్థిక లావాదేవీలే ఇందుకు కారణమని గుర్తించారు. గొల్లప్రోలు పోలీసుస్టేషన్‌లో ఆదివారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఇందుకు సంబంధించిన వివరాలు తెలిపారు.

అసలేం జరిగిందంటే..?

గొల్లప్రోలు మండలం తాటిపర్తికి చెందిన రంపం గంగాధర్ తన బంధువులైన రంపం శ్రీనివాస్, తొరాటి సూరిబాబు, స్నేహితుడైన కుంపట్ల సూరిబాబు(బాబ్జీ) వద్ద అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించాలని కొంత కాలంగా కోరుతున్నారు. ఈ నేపథ్యంలో గంగాధర్ తన బంధువులైన శ్రీనివాస్, సూరిబాబును ఫ్రైడ్ రైస్ పార్టీ ఇస్తానని చెప్పి పిలిచి ఈనెల 16న రాత్రి 8గంటల సమయంలో మొగలి చిన్నకు చెందిన పొలంలోని నూతి వద్దకు తీసుకువెళ్లాడు. నూతి గట్టుపై కూర్చుని ఫ్రైడ్ రైస్ తింటుండగా వారిద్దరిని గంగాధర్ నూతిలోకి తోసి హత్య చేశాడు. అనంతరం స్నేహితుడైన కుంపట్ల సూరిబాబు ను టీ తాగడానికి గొల్లప్రోలు వెళ్లి వద్దామని పిలిచి తాటిపర్తి రోడ్డులోని సుద్దగడ్డ కాలువ వద్దకు తీసుకువెళ్లి సెల్‌ఫోన్ పడిపోయిందని చెప్పి వెతుకుతున్నట్టు నటించాడు. సూరిబాబును కాలువలోకి తోసి గంగాధర్ చంపడానికి ప్రయత్నించగా అతడు తప్పించుకు పారిపోయాడు. 17న ఉదయం విషయం బంధువులకు తెలియజేయడంతో వారు వెళ్లి చూడగా మృతదేహాలు లభించాయి. ఈ ఘటనపై రంపం శివదుర్గ ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్, ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్ పర్యవేక్షణలో పిఠాపురం సీఐ శ్రీనివాస్, సర్కిల్ ఎస్ఐలతో నాలుగు బృందాలు ఏర్పాటుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో నిందితుడుగా ఉన్న రంపం గంగాధర్ విశాఖపట్నం పారిపోయి డబ్బులు అయిపోవడంతో తన మోటార్ సైకిల్ తాకట్టు పెట్టి డబ్బులు తీసుకుని దూరంగా వెళ్లిపోయేందుకు పిఠాపురం రైల్వేస్టేషన్‌కు రాగా అతడిని అరెస్టు చేశారు. శ్రీనివాస్, సూరిబాబు నూతి లోకి తోసేయడం వల్లే చనిపోయారా, ఆహార పదార్థాల్లో ఏమైనా విష పదార్థాలు కలిపారా అన్నది పోస్టుమార్టం పూర్తి నివేదిక వచ్చిన తర్వాత తెలుస్తుందని చెప్పారు. ఈ సంఘటనకు ఆర్థిక లావాదేవీలే కారణమన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

నేటి నుంచి రత్నగిరిపై దసరా ఉత్సవాలు

సాయంత్రం 6.30 గంటల నుంచి అంతరాలయ దర్శనాలు నిలుపుదల : ఈవో

అన్నవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈవో సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్రరక్షకులు అయిన వనదుర్గ, కనకదుర్గ అమ్మవార్లు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు. సోమవారం ఉదయం 8గంటలకు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభమవుతుంది. పండితులకు దీక్షా వస్త్రధారణ, జపములు, సూర్యనమస్కారాలు, మహానీరాజనం, పరివారదేవతారాధనలతోపాటుగా అక్టోబరు 2 వరకు కుంకుమపూజలు నిర్వహిస్తారు. దసరా ఉత్సవాలు జరిగే రోజుల్లో ప్రతినిత్యం సాయంత్రం 6.30 గంటల నుంచి 8గంటల వరకు అంతరాలయ దర్శన టిక్కెట్ల విక్రయాలు నిలుపుదల చేస్తామని, భక్తులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.50001, గోసంరక్షణ ట్రస్ట్‌కు రూ.50001ను బాపట్లకు చెందిన కుర్రా పూర్ణశ్రీత ఆదివారం విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని ఈవో సుబ్బారావుకు అందజేయగా అభినందించి స్వామి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

ముమ్మరంగా వాహనాల తనిఖీ

మోతుగూడెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21 నుంచి 27 వరకు మావోయిస్టుల పార్టీ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల ప్రాంతంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఏవోబీలో పోలీసులు బలగాలను మోహరించి గాలింపు చేస్తున్నారు. అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో ఒడిశా నుంచి మోతుగూడెం మీదుగా రాజమండ్రి, తెలంగాణ ప్రాంతంలో వెళ్లే వాహనాలను మోతుగూడెం ఎస్ఐ సాదిక్, సిబ్బంది, సీఆర్పీఎఫ్ ఏ/42 బెటాలియన్ ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించి ఆ తర్వాత పంపుతున్నారు.



మోతుగూడెం పోలీస్ స్టేషన్ చెక్ పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆర్టీసీ నైట్ సర్వీస్ రద్దు

మావోయిస్టుల పార్టీ ఆవిర్భావ వారోత్సవాల సందర్భంగా ఈనెల 21 నుంచి 27 వరకు ఏజెన్సీలో ఆర్టీసీ నైట్ సర్వీసులు రద్దు చేశామని ఆర్టీసీ విశాఖపట్నం డిపో మేనేజర్ మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం నుంచి మోతుగూడెం మీదుగా భద్రాచలం వెళ్లే అంతర్రాష్ట్రీయ సర్వీసులు నిలిపివేశామని, 28 నుంచి నైట్ సర్వీసులు తిరిగి ప్రారంభిస్తామన్నారు.

అమ్మో.. ఆరడుగులే!



తాచుపామును బంధిస్తున్న స్నేక్‌క్యాచర్ గణేష్‌వర్మ

ముమ్మిడివరం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కొమానపల్లిలోని కాపూరి రామకృష్ణ ఇంటి ఆవరణలోని దొడ్డం గుడిలో ఆదివారం తాచుపాము హల్‌చల్ చేసింది. ఆరు అడుగుల తాచుపాము హల్‌చల్ చేయడంతో ఇంటి యజమాని, స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించడంతో పామును చాకచక్యంగా బంధించారు.




చెరువు చూడతరమా...

యానాం గిరియాంపేటలో గ్రాంటు సమీపంలోని చెరువులో తామర పుష్పాలు ఇలా కనువిందు చేశాయి. - యానాం (ఆంధ్రజ్యోతి)

చేపల వేట.. చాలా సులభమట!



అమీనాబాద్ ఉప్పుటేరు పాయలో చేపలు పట్టి తీసుకెళ్తున్న దృశ్యాలు





- కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ-అమీనాబాద్ తీరప్రాంతాల్లో ప్రస్తుతం మత్స్యకారులకు చేపలు లభ్యం కాకపోవడంతో ఉప్పుటేరుపాయలో సులువుగా చేపలను పట్టుకుంటున్నారు. దీనికి పెట్టుబడి కేవలం ఖాళీ డ్రింకు బాటిళ్లు, కిలో మైదా పిండి మాత్రమే. 2 లీటర్ల బాటిల్ అడుగుభాగం కట్ చేసి పైన తాళ్లతో చిక్కం మాదిరిగా తయారు చేసి నీళ్లతో కలిపిన మైదా పిండిని నింపి ఉప్పుటేరు పాయలో విసురుతున్నారు. క్షణాల్లో చేప బాటిల్‌లోని మైదా కోసం రాగానే బాటిల్ పైగా లాగేయడంతో చేపలు చిక్కుతున్నాయి. కిలో, 2 కిలోల కట్టచేపలు దొరుకుతున్నాయి. వీటిని మార్కెట్లో విక్రయిస్తూ మత్స్యకారులు ఉపాధి పొందుతున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

పీహెచ్‌సీ నిర్మాణానికి శంకుస్థాపన

తాళ్లరేవు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గాడిమొగ ఆసుపత్రి ప్రాంగణంలో పీహెచ్‌సీ నిర్మాణానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఎంపీపీ రాయుడు సునీత, టీడీపీ నేతలు మల్లాడి సీతారామరాజు, సంగాడి కామేశ్వరరావు, జక్కల ప్రసాద్‌బాబు, వాడ్రేవు వీరబాబు, వుంగరాల వెంకటేశ్వరరావు, పొన్నమండ రామలక్ష్మి, రామాడి రామలక్ష్మి, పీహెచ్‌సీ వైద్యాధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు'



క్రీడా కోటాలో ఉద్యోగాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న అధికారులు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీనివాస్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా స్థాయి జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ ఆదివారం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని జిమ్నాస్టిక్స్ హాలులో జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్సీఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ మేనేజింగ్ డైరెక్టర్ నారాయణం మురళి, డీఎస్డీవో శ్రీనివాస్‌కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. స్టేడియానికి వాల్ మౌంటెండ్ ఫ్యాన్లు అందజేస్తానని మురళి ప్రకటించారు. అండర్-6, 8, 10, 12 సబ్ జూనియర్ విభాగాల్లో వివిధ క్రీడాంశాల్లో సుమారు 100 మంది బాలబాలికలు పాల్గొన్నారు. అనంతరం అండర్-12, సబ్ జూనియర్ విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్లను ఎంపిక చేశారు. జిమ్నాస్టిక్స్‌లో రాణించి స్పోర్ట్స్ కోటాలో డీఎస్సీలో పీడీలుగా ఉద్యోగాలు పొందిన ఎస్కే. యాసిన్, పవిత్రలను సత్కరించారు.

ఘనంగా గురజాడ జయంతి



పిఠాపురంలో గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ కేశవరావు, అధ్యాపకులు

పిఠాపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహాకవి గురజాడ అప్పారావు 163వ జయంతిని ఆదివారం నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి ప్రిన్సిపాల్ వి.కేశవరావు పూలమాల వేసి నివాళులర్పించారు. యువత గురజాడ అడుగుజాడల్లో నడిచి కుల, మతాలకు అతీతంగా కలసిమెలసి జీవించి దేశాన్ని అభ్యుదయ పథంలో నడిపించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి.కాశీవిశ్వనాథం, శోభన్‌బాబు, ఎస్కే హుస్సేన్ మొహిద్దీన్, ఈజే డేనియల్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ అప్పారావు 163వ జయంతి సందర్భంగా పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ సభను యాసలపు సూర్యారావు భవనంలో బుద్ద శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోశ్యుల కృష్ణబాబు మాట్లాడుతూ గురజాడ అప్పారావు కన్యాశుల్కానికి వ్యతిరేకంగా పోరాడారన్నారు. చిత్రలేఖనం సబ్ జూనియర్స్ జూనియర్స్ సీనియర్స్, సూపర్ సీనియర్స్ విభాగాల్లో బి.లతిక, వి.భార్గవి, టి.హేమంత్, వి.అనిత (ప్రథమ), ఎం.ప్రణీత, సాయివీరాచారి, ఎం.హాసిని, అమృతప్రియ, కె.ప్రశాంతి (ద్వితీయ), కె.రేణుక, ఎస్కే అఫ్మాద్‌సాహిదా, పి.రేష్మ, డి.నేహా (తృతీయ) బహుమతులు గెలుపొందారు. కార్యక్రమంలో కరణం రాజకుమార్, రాజేష్‌కుమార్ దేవత, గునురి రమణ, కోరుకొండ సత్యనారాయణ, రత్నవతి, ముమిడివరపు కార్తీక్‌శ్రీనివాస్, అనూష, అంజలి, రొంగల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

కాకినాడ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సూర్యారావుపేటలో గల శ్రీ రామలింగేశ్వర సమేత శ్రీబాలాత్రిపురసుందరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆదివారం రాత్రి పరిశీలించారు. అనంతరం ఉత్సవ కమిటీ చైర్మన్, ట్రస్టు బోర్డు సభ్యులతో సమావేశమై ఉత్సవాల నిర్వహణకు పలు సూచనలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ, ఈవో వుండవల్లి వీర్రాజు చౌదరి, ట్రస్టు బోర్డు సభ్యులు నీకోటి అప్పలకొండ, చిట్టిపెద్ది రాంబాబు, సుందరపల్లి సత్తిబాబు, తంగెళ్ల రాంబాబు, నల్లారి తులసి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ పద్మశ్రీని సత్కరిస్తున్న కూటమి నాయకులు

ఎమ్మెల్సీ పద్మశ్రీకి సత్కారం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీని కూటమి నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ గోడి సత్యవతి, మాజీ కౌన్సిలర్ గరిమెళ్ల శర్మ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. నాయకులు గోడి వెంకట్, గుబ్బల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు, కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న బాలకృష్ణ

పేదలకు దుస్తులు, కళ్లజోళ్ల పంపిణీ

కాకినాడ రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెడ్ కాన్వెంట్ చారిటబుల్ ట్రస్టు, లయన్స్ క్లబ్ కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ హాల్లో సుమారు 120 మంది పేదలకు దుస్తులు, కళ్లజోళ్లను లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, సుబ్బారావు, పాపారావు పాల్గొన్నారు.



పరీక్షకు హాజరైన విద్యార్థులు

శాస్త్రీయ నృత్యం, సంగీతం ప్రాక్టికల్ పరీక్షలు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన కళా కేంద్రం చండీగడ్ యూనివర్సిటీ వార్షిక శాస్త్రీయ నృత్యం, కర్ణాటక సంగీతం ప్రాక్టికల్ పరీక్షలు నగరంలోని సురేష్‌నగర్‌లో గల శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్లో ఆదివారం జరిగాయి. కాకినాడ, సామర్లకోట, పెద్దాపురం, రాజమహేంద్రవరం, కిర్లంపూడి తదితర ప్రాంతాల నుంచి సుమారు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగిన పరీక్షలను సెంటర్ హెడ్ 'నాట్యాచార్య' బేతా సత్యనారాయణ, ప్రిన్సిపల్ శ్రీదేవి పర్యవేక్షించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన నాట్యాచారిణి పారుపూడి అరుణాస్వరూప్, సంగీత విద్వాంసుడు మధుసూదన్ ఎగ్జామినర్స్‌గా వ్యవహరించారు.





పాదగయ ఆవరణలో, పుష్కరిణి వద్ద పిండ ప్రదానాలు చేస్తున్న భక్తులు

పాదగయకు పోటెత్తిన భక్తులు

మహాలయ అమావాస్య సందర్భంగా పిండ ప్రదానాలు

పిఠాపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. పితృ పక్షాలుగా వ్యవహరించే ఈ సమయంలో మహాలయ అమావాస్యకు విశేష ప్రాధాన్యముంది. పితృ దేవతలకు ఈ రోజున పిండ ప్రదానాలు చేస్తే మంచిదనే నమ్మకంతో ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక, ఉత్తరాది రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. మహాలయ అమావాస్య ఆదివారం రావడంతో ఏటాకంటే ఈసారి రద్దీ మరింత అధికంగా ఉంది. ముందుగా పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి పితృ దేవతలకు పిండప్రదానాలు గావించారు. పాదగయ పరిసరాలన్నీ పిండ ప్రదానాలు చేసేందుకు వచ్చిన భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం 4,028 పిండ ప్రదానాలు జరిగాయని ఆయన చెప్పారు.

పాదగయలో భక్తులు రద్దీ అధికంగా ఉండడంతో పిఠాపురం-సామర్లకోట రోడ్డులో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. పట్టణ పోలీసు స్టేషన్ నుంచి బైపాస్ మీదుగా సామర్లకోట రోడ్డుకు వాహనాలను మళ్లించారు. బైపాస్‌తో పాటు పిఠాపురం-సామర్లకోట రోడ్డులో వాహనాలను బారులు తీరి నిలిపారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంత జీవనం: ఎమ్మెల్యే రాజప్ప



సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద పందిరి షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప, డీసీసీబీ చైర్మన్ బాబు

సామర్లకోట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషీ ఆధ్యాత్మికత అలవర్చుకోవడం ద్వారా సమాజంలో శాంతియుత వాతావరణం, సేవాగుణంతో మెలగవచ్చని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. పట్టణంలోని అయోధ్యరామపురంలో సత్తెమ్మ ఆలయం వద్ద ఆధునిక పందిరి షెడ్‌ను రూ. 3.25 లక్షలతో పూర్తి చేయగా పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) ఆదివారం ప్రారంభించారు. వారిని ప్రముఖ జ్యోతిషవేత్త చీమలకొండ వీరభద్రప్రసాద్ ఆధ్వర్యంలో సన్మానించి సత్తెమ్మ తల్లి చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్‌మోహన్ (బాబు), కొండపల్లి కృష్ణమూర్తి, బలుసు శ్రీనివాసు, వల్లూరి దొరబాబు, ఎండీ సైపుల్లా, తోట రవిశంకరశ్రీనివాసు, సరోజా వాసు, మంచెం సాయిబాబు, అత్తిలి కృష్ణ, పోలినాటి రమేష్, పెనుపోతుల సత్యనారాయణ, లయన్స్ క్లబ్ చైర్మన్ డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు, చిత్తులూరి రాజా, ఈదర ఈశ్వరకుమార్ పాల్గొన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేసిన పలువురు ప్రతినిధులను ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు సన్మానించారు.



పిఠాపురంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి సాకా రామకృష్ణ

'విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం'

పిఠాపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకుంటామని, అన్ని వర్గాల ప్రజలను చైతన్యపరచి ఉద్యమం నిర్వహించాలని పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. సీపీఐ కార్యదర్శి సాకా రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ రాజకీయపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటుపరం చేస్తే పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వివిధ సంఘాలు, పార్టీల నాయకులు వీఎస్ రెడ్డి, కోనేటి రాజు, కుంచే చిన్నా, కౌన్సిలర్ పెదపాటి రాజేష్, కె.నాగేశ్వరరావు, పేపకాయల ప్రసాద్, అరుణ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

కాకినాడ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సిటీ నియోజకవర్గ పరిధిలోని ఐదుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2,94,986 మంజూరైంది. ఆదివారం వాటిని చెక్కుల రూపంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తన నివాసంలో అందజేశారు. టీడీపీ నాయకులు గదుల సాయిబాబు, వొమ్మి బాలాజీ, తుమ్మల రమేష్, అరదాడి దుర్గారావు, మల్లాడి గంగాధరం, బొడ్డు శివాజీ, మల్లాడి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

'సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటరు మంజూరు చేయాలి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటరు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు కోరారు. నగరంలో ఆదివారం జరిగిన సమావేశంలో సుమారు వంద మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాకినాడలో 25 పైగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, మంత్రిత్వ శాఖలు ఉన్నాయన్నారు. సుమారు వెయ్యి కుటుంబాలకు చెందిన 3వేల మంది సర్వీసు ఉద్యోగులు, 100 శాఖలకు చెందిన రిటైర్డ్ ఉద్యోగులు నివాసం ఉంటున్నారన్నారు. వీరికి సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్ అవసరం ఎంతో ఉందన్నారు. సమష్టి కృషి, సహకారంతో త్వరితగతిన ఏర్పాటు జరిగేలా చూడాలన్నారు. ఈ సెంటరు మంజూరయ్యే వరకు ప్రస్తుతం కాకినాడలో గల 100 పడకల ఈఎస్ఐ హాస్పిటల్ సేవలను సీజీహెచ్ఎస్ సభ్యులకు తాత్కాలికంగా అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్వీ ఎస్ఎస్ సాయిరాం, సభ్యులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న భారతీయ జనతా పార్టీ నాయకులు

యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు కోరారు. ప్రధానమంత్రి మోదీ సేవా సప్తాహంలో భాగంగా ఆదివారం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా భారీ ర్యాలీ నిర్వహించారు. జేఎన్టీయూ వద్ద ప్రారంభమైన ర్యాలీ ఎస్పీ కార్యాలయం మీదుగా భానుగుడి సెంటరు వరకు సాగింది. డ్రగ్స్ రహిత భారతదేశం చూడాలన్నదే ప్రధాని లక్ష్యమన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు తెలియజేసేందుకు ప్రతి కళాశాలలోనూ బీజేపీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులతో డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు యార్లగడ్డ రామ్‌కుమార్, పైడా కృష్ణమోహన్, గట్టి సత్యనారాయణ, పెద్దిరెడ్డి రవికిరణ్, యెనిమిరెడ్డి మాలకొండయ్య, వేటుకూరి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

'కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలి'

పిఠాపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పురాతన హైందవ సంప్రదాయాలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన కానిస్టేబుళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వ హైందవ పరిషత్ అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు ఆదివారం డిమాండ్ చేశారు. పట్టణంలోని మంగాయమ్మరావుపేట, ఇందిరానగర్‌ల్లో శనివారం రాత్రి అక్కడి ప్రజలు పురాతన సంప్రదాయ పద్ధతుల్లో వెంకన్నబాబు పాట నిర్వహించారని తెలిపారు. హిందువులు భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఈ కార్యక్రమాలను పోలీసులు అడ్డుకుని పాట నిర్వహించే సామగ్రిని, మైక్‌సెట్‌ను పట్టుకుపోయారని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చినట్టు చెప్పారు. ఈ ఘటనకు పాల్పడిన పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వెంకటేశ్వరరావు అధికారులను కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సామర్లకోట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండల పరిధిలోని అచ్చంపేట నిర్మాణంలో ఉన్న 33 కేవీఏ సబ్ స్టేషన్ లైన్ పనుల నిమిత్తం సోమవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ పెద్దాపురం ఈఈ ఏవీఎస్ఎస్ ప్రభాకర్ తెలిపారు. పనసపాడు ఫీడర్, అపెక్స్ ఫీడర్, వాకలపూడి ఫీడర్, దేవీ సీఫుడ్స్ ఫీడర్, అచ్చంపేట, కొప్పవరం, పనసపాడు, వేట్లపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో ఇండస్ట్రియల్ ఫీడర్, వ్యవసాయ ఫీడర్, గృహావసరాల ఫీడర్‌లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏడీఈ కిరణ్, రూరల్ ఏఈ నాగేశ్వరరావు చెప్పారు.

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



సామర్లకోట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కుమారరామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపురసుందరి అమ్మవారికి సోమవారం నుంచి పూజలు నిర్వహించనున్నట్టు ఈవో బళ్ల నీలకంఠం, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు) తెలిపారు. అమ్మవారిని పది రోజుల్లో పది అలంకారాలతో భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తామన్నారు. అక్టోబరు 2న అమ్మవారిని రజత చీరతో సర్వాంగసుందరంగా అలంకరిస్తామన్నారు. ప్రతిరోజూ దుర్గాసప్తశతి పారాయణ, బాలాపరమేశ్వరీ మంత్రజపాలు, స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, సహస్ర బిల్వార్చన, అమ్మవారికి నవవరణార్చన పూజలు జరుపుతామని చెప్పారు.

నేటి నుంచి భేతాళస్వామి ఉత్సవాలు



సామర్లకోట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేట్లపాలెం భేతాళ స్వామి ఆలయంలో సోమవారం నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. సోమవారం భేతాళస్వామి ఉత్సవమూర్తిని గ్రామ పొలిమేర నుంచి భారీ ఊరేగింపుగా ఆలయానికి తరలిస్తామని కమిటీ ప్రతినిధులు కొండపల్లి జగ్గారావు, కొండపల్లి కృష్ణమూర్తి, గుణ్ణం సూర్యారావు చెప్పారు. నవరాత్రి పూజల అనంతరం అక్టోబరు 2న సంబరం నిర్వహిస్తామన్నారు.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా భువనేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం

పెద్దాపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక వర్ధులవారి వీధిలో వేంచేసియున్న భువనేశ్వరి పీఠంలో దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. పీఠాధిపతి చింతా గోపీశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎం.శ్రీనివాస్, మండ ప్రకాష్, పాలకుర్తి సతీష్, నమ్మి సత్యనారాయణ, బొట్ట శ్రీనివాసరావు, తార వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):మండలంలో గండేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గండేపల్లి, సింగరంపాలెం, రామయంపాలెం, ఎన్టీరాజాపురం, బొర్రంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో బొర్రంపాలెం, మల్లేపల్లి, అలాగే నాయకంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో నాయకంపల్లి, యల్లమెల్లి గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫ రాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈబీ వీరభద్రరావు, గండేపల్లి ఏఈ కిరణ్ కిషోర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రహదారి, వంతెనలు నిర్మించాలని
ప్రజా సంఘాల ఆందోళన



కోటలోని కన్నేరు వాగు వద్ద ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వై.రామవరం, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి):అల్లూరిజిల్లా వై.రామవరం మండలం కోట గ్రామంలో రహదారి, వంతెనలు నిర్మించాలంటూ ఆదివారం పలు ప్రజా సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. కోట నుంచి కన్నేరువాగు పై వంతెన నిర్మించాలంటూ ఏపీఆర్‌సీఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు వల్లూరి రాజాబాబు, ఏఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఉంచే అంజిబాబు, ప్రగతిశీల ప్రజాసంఘం మహిళా కన్వీనర్ డొక్కులూరి సంగీతల ఆధ్వర్యంలో పలు డిమాండ్‌లు చేశారు. గ్రామంలో డ్రైనేజీ, తాగునీరు, వ్యక్తిగత మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు తప్ప క్షేత్రస్థాయిలో సమస్యలపై ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. చింతపల్లి రత్నం, పరిశిక శ్రీను బాబు, చిన్నారావు, సావిత్రి, అబ్బులుదొర, పిట్టా శివ, జంపా కర్రెడ్డి పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రులకు ఆలయాలు ముస్తాబు

మోతుగూడెం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం శ్రీలక్ష్మీ గణపతి ఆలయం ఉన్న కనకదుర్గ అమ్మవారికి దసరా ఉత్సవాలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయి. లక్ష్మీగణపతి ఆలయ యూత్ సభ్యులందరూ కలిసి నిర్వహిస్తున్నారు

నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

వీఆర్‌పురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) మండలంలో నేటి నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు వీఆర్‌పురంలో దేవాలయాలు, మండపాలు ముస్తాబయ్యాయి. తెలంగాణ సాంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మ ఆట,పాటలతో మహిళలు బతుకమ్మను తయారుచేసి తొమ్మిది రోజులపాటు వైభవంగా దసరా శరన్నవరాత్రి నిర్వహిస్తారు. మండల కేంద్రంలోని దేవాలయాలతో పాటు, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్టేందుకు వడ్డిగూడెం, రేఖపల్లి, రాజుపేట తదితర గ్రామాలలో మండపాలను అలంకరిస్తారు.

బతుకమ్మ.. బతుకమ్మ... మా బంగారు బతుకమ్మా!

● విలీన మండలాల్లో బతుకమ్మ సంబరాలు ప్రారంభం



బతుకమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్న మహిళలు

ఎటపాక,సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దసరా పండు గను పురస్కరించి మహిళలు, యువత ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ సంబరాలు ఆదివారం నుంచి విలీన మండలాల్లో ప్రారంభమయ్యాయి. మహిళలు ప్రత్యేక పూజల అనంతరం బతుకమ్మ సంబరాలు సందడిగా ప్రారంభించారు. తొలిరోజు అనేక రకాల ఆకర్షణీయమైన పూలతో బతుకమ్మలను తయారు చేసి, బతుకమ్మల చుట్టూ బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాల్లో.. మా బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆటపాటలతో సందడి చేశారు. తొలిరోజు ఎంగిలి పూవ్వు బతుకమ్మను ఏర్పాటు చేశారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

రాజవొమ్మంగి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మన్యంలో పోలీసులు విస్తృతంగా వాహనతనిఖీలు చేపడుతున్నారు. రాజవొమ్మంగి ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ జంక్షన్‌వద్ద ఆదివారం ఎస్‌ఐ శివకుమార్ వాహన తనిఖీలు చేశారు. అనుమానిత వ్యక్తులను విచారించారు. వాహన రికార్డులు, లైసెన్సులు లేని వారికి జరిమానా విధించారు.

ఉర్లాకులపాడును పంచాయతీగా చేయాలి

● మాజీ జడ్పీటీసీ బుజ్జి చిన్నాలమ్మ

రాజవొమ్మంగి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రస్తుతం మారేడుబాక పంచాయతీలో ఉన్న ఉర్లాకులపాడును ప్రత్యేక పంచాయతీ చేయాలని మాజీ జడ్పీటీసీ కోసూరి బుజ్జి చిన్నాలమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఉర్లాకులపాడు నుంచి పంచాయతీ కేంద్రానికన్నా మండల కేంద్రం దగ్గర అని ఆమె పేర్కొన్నారు. ఉర్లాకులపాడు పంచాయతీ చేస్తే ఉర్లాకులపాడు, జి.శరభవరం, కోసూరి వారివీధి గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరం అని ఆమె అన్నారు. దీనిపై ఇప్పటికే జిల్లా కలెక్టర్‌కు, ఎంపీడీవో, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందించామని, సోమవారం రంపచోడవరం ఐటీడీఏలో జరుగనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు గ్రామాల ప్రజలు వెళ్లి పీవోకి వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆరోగ్య కార్యకర్తలపై పనిభారం తగ్గించాలి

● ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ

ఎటపాక, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఆరోగ్య కార్యకర్తలు (ఆశ వర్కర్ల)పై పనిభారం తగ్గించాలని, వారి హక్కులు సాధించేందుకు కలిసి పోరాడాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ అన్నారు. ఆదివారం ఎటపాకలో సీఐటీయూ అనుబంధ ఆశా వర్కర్స్ యూనియన్ మండల మహాసభను నిర్వహించారు. ఈసందర్భంగా వాణిశ్రీ పాల్గొని మాట్లాడారు. నెట్‌వర్క్ సమస్యతోపాటు పనిచేయని ఫోన్లతో ఆశాలపై పలు రకాల యాప్‌లు రుద్దడం, రికార్డులు సిద్ధం చేయాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. రోగులకు ఆరోగ్యం విషమిస్తే ఆశాలను బాధ్యులుచేస్తూ వేధించడం సరి కాదన్నారు. విశాఖలో జరిగే సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం 25 మందితో కూడిన ఆశా వర్కర్ల యూనియన్ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపా ధ్యక్షురాలు లాలీబాయి, ఐద్వా జిల్లా కార్యదర్శి ఐ.పద్మ, పులుసు బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ జేఏసీ డివిజన్ చైర్మన్‌గా జల్లి నరేష్ ఎన్నిక



చింతూరు,సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ జేఏసీ డివిజన్ చైర్మన్ గా జల్లి నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం చిం తూరులో జేఏసీ డివిజన్ కమిటీ విస్తృత స్థాయి సమావేశంను నిర్వహించారు. ఈసమావేశంకు ఆదివాసీ జేఏసీ సెంట్రల్‌కమిటీ సభ్యుడు మడివి నెహ్రూ, జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ సమక్షంలో నరేష్‌ను ఏకగ్రీవంగా ఎను న్నకోవడం జరిగింది. వైస్ చైర్మన్‌గా ఉయిక రాంప్రసాద్ కారం సాయి బాబు, శీలం తమ్మయ్య, మల్లయ్య, సున్నం శేఖర్, కుంజా శ్రీను బాబురావు, ప్రచా ర కార్యదర్శిలుగా సోడే శ్రీను, పాయం చంద్రయ్యను ఎన్నికవగా, కమిటీ సభ్యులుగా మడివిరాజు, సోయం కన్నారావు, పొడియం లక్ష్మణ్, లోవరాజు లను ఎన్నుకున్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

● నేటి నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభం



ఏలేశ్వరంలో అమ్మవారి ఉత్సవాల్లో ఆకట్టుకుంటున్న సెట్టింగ్, శంఖవరంలో అమ్మవారి వేషధారణలతో చిన్నారులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయాలతో పాటు పలు గ్రామదేవతల ఆలయాలు దేవీ నవరాత్రి ఉత్సవాలకు ముస్తాభయ్యాయి. సోమవారం నుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ముందుగానే ఆలయాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలంకరణలు సిద్ధం చేశారు. ధర్మవరం విజయదుర్గ అమ్మవారి ఆలయంవద్ద ప్రధాన రహదారి వెంబడి కూడా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే ఒమ్మంగి, ప్రత్తిపాడు, పెద్దిపాలెం, లంపకలోవ, ఏలూరు, చినశంకర్లపూడి తదితర ఆలయాలు దేవీ నవరాత్రి ఉత్సవాలకు సన్నద్ధమయ్యాయి.ఈ ఆలయాలు వద్ద దసరా ముగింపు వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఉత్సవాల నిర్వహణకు ఉత్సవ కమిటీలు సన్నాహాలు చేపట్టాయి.

ఘనంగా దసరా ఉత్సవాలు

శంఖవరం(ఆంధ్రజ్యోతి):మండలంలోని మండపం గ్రామంలో శ్రీసత్యభారతి పాఠశాలలో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులతో వివిధ దేవతామూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. దసరా సెలవుల నేపథ్యంలో విద్యార్థులు వివిధ ప్రాంతాలకు వెళ్లినప్పుడు కాలువ, చెరువులు, విద్యుత్ సమీపప్రాంతాలకు వెళ్లకూడదని కరస్పాండెంట్ చంద్రరావు, వీరబాబులు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సూచించారు.

ఏలేశ్వరం(ఆంధ్రజ్యోతి): దేవి నవరాత్రి ఉత్సవాలకు గ్రామాల్లో ఆలయాలవద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. నేటి నుంచి అక్టోబర్ 2వరకు జరిగే దసరా ఉత్సవాలకు పట్టణంలో జేవీఆర్ ట్రస్ట్ చైర్మన్ జువ్విన వీర్రాజు వీర్రాఘవమ్మ దంపతుల ఆధ్వర్యంలో లింగవరం కాలనీలో శ్రీదుర్గాదేవి అమ్మవారి 15వ నవరాత్రి మహోత్సవాలు, ఆలయకమిటీల నేతృత్వంలో దిబ్బలపాలెం సంతోషిమాత ఆలయం, ఆర్టీసీ, నర్సీపట్నం రోడ్డు, లింగంపర్తి, యర్రవరం ఆలయాలవద్ద ఉన్న దుర్గాదేవి ఆలయాలు విద్యుత్ కాంతులు, పూల అలంకరణలతో ఆలయ కమిటీ సభ్యులు ఆలయాలను తీర్చిదిద్దారు. నేటి నుంచి 9రోజుల పాటు కుంకుమపూజలు, బోనాలు, దీపాలంకరణ, సరస్వతి పూజలు, భజన వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఖాదీ బోర్డు సేవలు విస్తరణకు కృషి

● డైరెక్టర్ కొమ్ముల



ఖాదీ బోర్డు డైరెక్టర్ కన్నబాబును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖాదీ బోర్డు సేవలు నియోజకవర్గంలో విస్తరింప చేసేందుకు కృషి చేస్తామని రాష్ట్ర ఖాదీ బోర్డు నూతన డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు చెప్పారు. స్థానిక నివాస గృహంవద్ద ఉన్న కొమ్ముల కన్నబాబును ధర్మవరం టీడీపీ నాయకులు బొండాడ నారాయణుడు, పుణ్యమంతుల రాజా, వాల్డన్, తదితరులు ఆదివారం కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మదినే స్వామి, పోలిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

'సెలవుల్లో అప్రమత్తంగా ఉండండి'

జగ్గంపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): దసరా సెలవులు సందర్భంగా ఊర్లు వెళ్లే జగ్గంపేట సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి, గండేపల్లి, జగ్గంపేట మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్ సూచించారు. ఆదివారం సీఐ శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ఇల్లు విడిచి కుటుంబ సమేతంగా వెళ్లే వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందజేస్తే పోలీసు నిఘా ఏర్పాటుచేస్తామన్నారు. విలువైన ఆభరణాలు, నగదు గృహాలలో ఉంచరాదన్నారు.

ఎమ్మెల్యే జ్యోతులను సత్కరించిన
యర్రంపాలెం ఫిషర్‌మెన్ సొసైటీ సంఘం



ఎమ్మెల్యేను సత్కరించిన యర్రంపాలెం ఫిషర్‌మెన్ సొసైటీ సంఘం

జగ్గంపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మనగర్‌లోని టీడీపీ పార్టీ కార్యాలయంలో గండేపల్లి మండలం యర్రంపాలెం ఫిషర్‌మెన్ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించిన చైర్మన్ పాకా నాగేశ్వరరావు, సెక్రటరీ పెదపాటి సుబ్బారావు సంఘ సభ్యులతో కలిసి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విజయం సాధించిన ఫిషర్‌మెన్ సొసైటీ సభ్యులందరినీ ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ ఫిషర్‌మెన్ సొసైటీ చెరువులను అభివృద్ధి చేసుకోవడానికి తనవంతు సహకారం అంది స్తానని ప్రభుత్వ ఆదరణ పథకం ద్వారా లభించే మో పెడ్లు, వలలు, ఐస్ బాక్సులు, రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్య క్రమంలో కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన రావు, గండేపల్లి ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెదపాటి శుభకర్, గండేపల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ, రేఖ బుల్లిరాజు, సైనం సత్తిబాబు, పిల్లి సుబ్బారావు, నూక తట్టు దేవదాసు, సైనం పౌలు, పులి వెంకన్న, నీలపల్లి అప్పారావు, బొర్ర ప్రసన్నకుమార్, రొట్టె విజయరావు, సైనం చిన్నబ్బు, పెదపాటి ఏసు, గొల్లపల్లి గంగరాజు, నూతటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నసమారాధన



అన్న సమారాధనలో పాల్గొన్న సీఐ వైఆర్‌కే శ్రీనివాస్

జగ్గంపేట, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి):మహాలయ పితృపక్ష అమావాస్య సందర్భంగా మహా అన్నదానం చేయడం ద్వారా పూర్వీకులకు నివాళి అర్పించవచ్చు అని వారి ఆశీర్వాదాలను పొందవచ్చు అని వాకర్స్ క్లబ్ ఫౌండర్, జిల్లా మాజీ గవర్నర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) అన్నారు. జగ్గంపేట సెంటర్లో పాత పోలీస్‌స్టేషన్ ఆవరణలో జగ్గంపేట వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మహాలయ పితృపాక్ష అమావాస్య సందర్భంగా మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్ఐ టి.రఘునాథరావు ముఖ్యఅతిథులుగా హాజరై అన్నదానం చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో 500 మంది పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఎలైట్ కంటెస్టింగ్ ఇంటర్నేషనల్ ప్రెసి డెంట్ రావు కృష్ణారావు, వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు ముమ్మిడివరపు సురేష్, ఎలక్ట్రిక్ గవర్నర్ తోలేటి సూర్యనారాయణ, వి.నాగసత్య, కంటే ఉదయ భాస్కర్ చౌదరి, వాకర్స్ క్లబ్ సభ్యులందరూ పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లే భక్తులకు భోజన, వసతి సౌకర్యం



భక్తులకు భోజనాలు పెడుతున్న దృశ్యం

భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పాల చర్ల నాగేంద్రచౌదరి మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాలుగా విజయవాడ దుర్గమ్మ గుడికి కాలినడకన వెళ్లి భక్తులకు సేవ చేసుకునే అవకాశం ఆ దుర్గమ్మ తల్లి నాకు కల్పించాలని అన్నారు. ఇచ్ఛాపురం బోర్డర్ నుంచి విజయనగరం, శ్రీకాకుళం, పాడేరు, అరకు, వైజాగ్, తుని, అన్నవరం, కత్తిపూడి, ఇటు ఏజెన్సీ ప్రాంతాల నుంచి జగ్గంపేట మీదుగా వెళుతున్న భక్తులందరికీ మోహన్‌సాయి కృష్ణ రెసిడెన్సి లాడ్జిలో ఉచితంగా మూడు పూటలా భోజనం, వసతి, ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్రచౌదరి తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాలక్రితం రాత్రి సమయంలో నేషన ల్ హైవేలో నడిచి వెళ్లే భవానీ భక్తులు ప్రమాదానికి గురవుతున్నారు. ఈ విషయం నాకు చాలా బాధగా అనిపించి నా వంతుగా నడిచి వెళ్లే భవానీ భక్తులకు జగ్గంపేటలో సహాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం మొదలు పెట్టానన్నారు. విజయదశమికి నెలరోజుల ముందు నుంచి కూడా అధికసంఖ్యలో భవానీ భక్తులు వస్తున్నారు. ఈ కార్యక్రమం ఈ దసరా నవరాత్రుల్లోని కాకుండా 365 రోజులు కాలినడకన తీర్థయాత్రలు చేసే హిందూ బంధువులు అందరికీ నేను ఉచితంగా సౌకర్యాలు కల్పిస్తానన్నారు.

లోవ క్షేత్రంలో భారీ వర్షం

● స్తంభించిన జనజీవనం

తునిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తుని గ్రామీణ ప్రాంతాల్లో రెండు గంటలపాటు వర్షం ఎడతెరిపి లేకుండా కురిసింది. కురిసిన వర్షానికి ఎక్కడికక్కడే జన జీవనం స్థంభించింది. లోవ క్షేత్రంలో కురిసిన భారీ వర్షంతో భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు. ఆరుబయట వంటావార్పుకు సిద్దమైన భక్తులు సమస్యలు వర్ణణాతీతంగా మారాయి. చామవరం, కుమ్మరిలోవ, లోవ కొత్తూరు తదితర ప్రాంతాల్లో ప్రత్తి, కూరగాయల పంటలు నీట మునిగాయి.

ప్రత్తిపాడు(ఆంధ్రజ్యోతి):ప్రత్తిపాడులో ఆది వారం ఓ మోస్తరు వర్షం కురిసింది. క్యూలోనింబస్ వాతావరణ నేపథ్యంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసింది. వరుసగా గడచిన మూడు రోజులుగా అడపాదడపా వర్షాలు కురుస్తూ ఉండటంతో ఖరీఫ్ వ్యవసాయ సాగు కు ఈ వర్షాలు ఎంతో ప్రయోజనకరమవుతాయని రైతులు చెబుతున్నారు. మండలంలోని చెరువుల్లోకి పెద్దఎత్తున వర్షపునీరు తరలివచ్చి పొర్లు కట్టడాలు మీదుగా పలుచోట్ల చెరువు జలాలు బయటకు తరలివస్తున్నాయి.



లోవ దిగువన ప్రవహిస్తున్న వర్షంనీరు



ప్రత్తిపాడు హైవేపై వర్షం కురుస్తున్న దృశ్యం

వనదుర్గ ఆలయంలో ప్రత్యంగిరి హోమం



పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యంగిర హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం ప్రత్యంగిర దేవతను ఆవాహన గావించి హోమాలు, జపములు, పారాయణలు నిర్వహించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సత్యదేవుడికి వేడుకగా రథోత్సవం



రథంపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు

సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవ అయిన రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి బాజాభజంత్రీలతో తోడ్కొనివచ్చి పుష్పాలతో అలంకరించిన రథంపై ఆశీనులు గావించారు. ప్రత్యేకపూజలు అనంతరం భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షణ గావించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



తుని పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రచార బోర్డు

తునిరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):వాహనదారుల క్షేమంకోరి ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుంది. ఎప్పుడు రాజకీయనాయకులు వ్యాపార ప్రకటనలతో నిండి ఉండే తుని పట్టణ, గ్రామీణ కూడళ్ళు ఇప్పుడు అర్థవంతమైన సందేశాత్మకమైన బోర్డులు దర్శనమిస్తున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా వాహనదారులను అప్రమత్తంచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం పలు సూచనలతో కూడిన ప్రకటన బోర్డులు అమర్చుతోంది. తుని రైల్వే ఫ్లైఓవర్, పట్టణ శివారు, శ్రీనివాస సెంటర్ వంటి ప్రధాన కూడళ్ళలో భారీ కటౌట్‌లతో బోర్డులను ఏర్పాటుచేశారు. తాగి వాహనాలు నడిపినా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేసినా ఎంత ప్రమాదమో వివరిస్తూ చక్కటి సందేశాత్మక బోర్డులతో అవగాహన కల్పిస్తున్నారు. ఈ బోర్డులు రాకపోకలు సాగించే వారిని ఆకట్టుకుంటున్నాయి.

స్వచ్ఛ భారత్‌లో పరిసరాల పరిశుభ్రత



కిర్లంపూడి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు, స్వచ్ఛభారత్, సేవా పక్వాడ పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం కిర్లంపూడిలో బీజేపీ మండలాధ్యక్షుడు శరకణం రాజబాబు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు ఆదేశాల మేరకు జగ్గంపేట ఇన్‌చార్జి దాట్ల కృష్ణవర్మ, నాయకులు తోట సర్వారాయుడు, సింగిలిదేవి సత్తిరాజు పరిసరాలు శుభ్రపరిచారు. బ్లీచింగ్ చల్లి, మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు అల్లు శివరామ కృష్ణ, తోట గోపి, ఐవివి సత్యనారాయణమూర్తి, యడాలి రాంబాబు పాల్గొన్నారు.